ప్రయాణం.. నరకప్రాయం

- గుంతలమయంగా రహదారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని విన్నపం



గుంతలమయంగా ప్రధాన రహదారి

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడే కరవయ్యాడని మున్సిపాలిటీ ప్రజలు వాపోతున్నారు.

జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొల్లారంలోని జ్యోతి థియేటర్ నుంచి బాచుపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై అడుగుకో గుంత ఉండటంతో ప్రయాణం నరకంగా మారింది. అనేకసార్లు వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం..

ప్రతి ఏటా మున్సిపాలిటీకి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా రోడ్ల మరమ్మతులపై శ్రద్ధ తీసుకోకపోవడంతో పాలకవర్గం, అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలో 50వేలకు పైగా జనాభా ఉంటుంది. ప్రతినిత్యం ఈ రోడ్లపై భారీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వాహనాల రద్దీతో పాటు గుంతలు భారీగా ఉండటంతో ప్రయాణం నరకంగా మారుతోంది. ఇటీవల ఆటో యూనియన్ నాయకులు మున్సిపాలిటీ కమిషనర్‌కు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడంలేదు



ప్రధాన రహదారులపై గుంతలు ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. కనీసం గుంతలను కూడా పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వరప్రసాద్‌రెడ్డి
ఆటో యూనియన్ అధ్యక్షులు బొల్లారం

చర్యలు తీసుకుంటున్నాం



గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఇందుకోసం రూ.10లక్షల నిధులను కేటాయించాం. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

క్లుప్తంగా

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. కంగ్టి మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆయా పార్టీలవారు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. సిర్గాపూర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావుపాటిల్, నాయకులు రమేష్ చౌహాన్, రాజునాయక్, రవీందర్, మోహన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

పటాన్‌చెరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయ అవరణ, నరేంద్రకాలనీ సీత లేఔట్, బీరంగూడలో సోమవారం మొక్కల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి కౌన్సిలర్‌లు కృష్ణ, పట్లోళ్ల కల్పన ఉపేందర్‌రెడ్డి, చంద్రకళగోపాల్, ఎడ్ల రమేష్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ఖేడ్'లో శాంతి ర్యాలీ



నినాదాలు చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నారాయణఖేడ్‌లో సోమవారం క్రైస్తవ సంఘాలు, దళిత, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో రోజురోజుకు ఆరాచకాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు కేంద్రప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయా సంఘాల నాయకులు సల్మన్‌రాజు, జయరాజ్, దేవదానం, జాషువా, రాజు, సామేల్ పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నివాసముంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ బాలిక గత నెల 25న అదృశ్యమైంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని సోమవారం కుటుంబీకులకు అప్పగించారు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సత్యవతి కుమారి బావ శత్రుధన్ ముఖియల వద్ద నుంచి సత్యవతికుమారి చెల్లె మనిషాకుమారి 11 ఏళ్ల బాలిక గత నెల 25న అదృశ్యం కాగా మరుసటి రోజు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగించారు. హైదరాబాదులోని కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో బాలిక ఆచూకీని కనుగొని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిద్దాపూర్‌లో వృద్ధురాలు..



తుల్జమ్మ

ఝరాసంగం(జహీరాబాద్): వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెనుగు తుల్జమ్మ ఈ నెల 5న హైదరాబాద్‌లోని తన బంధువుల వద్దకు బయలుదేరింది. కుటుంబ సభ్యులు ఆమెను ద్విచక్రవాహనంపై సిద్దాపూర్ నుంచి ఝరాసంగంకు వచ్చి ఆటోలో పంపించారు. తరువాత రోజు వృద్ధురాలి కుటుంబ సభ్యుడు హైదరాబాద్‌లోని తమ బంధువులకు ఫోన్ చేయగా రాలేదని చెప్పారు. దీంతో వృద్ధురాలి ఆచూకీ కోసం బంధువుల ఇళ్లల్లో, జహీరాబాద్‌లో వెతకగా సమాచారం లభించకపోవటంతో ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్‌లుగా బాధ్యతల స్వీకరణ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం తహసీల్దార్‌గా రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన దశరథ్‌సింగ్ రాథోడ్ పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. దీంతో కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న రవికుమార్ జిన్నారం తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ్, సర్వేయర్ రామభద్రం తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల తహసీల్దార్‌గా సంధ్య బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కొండాపూర్(సంగారెడ్డి): మండల తహసీల్దార్‌గా అనిత, ఎంపీడీఓగా మధులత సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇదివరకు తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆశాజ్యోతి వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా మేడ్చెల్ జిల్లా నుంచి తహశీల్దార్‌గా అనిత కొండాపూర్‌కు విచ్చేశారు. అదేవిధంగా కొండాపూర్ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన జయలక్ష్మీ పుల్‌కల్‌కు బదిలీ అయ్యారు.

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టౌన్ తహసీల్దార్‌గా భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పరమేశం బదిలీపై సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో నాగర్ కర్నూల్‌కు చెందిన భాస్కర్ తహసీల్దార్‌గా వచ్చారు.

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లేశ్‌కుమార్‌ను మీ–సేవా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఇదివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన తారాసింగ్ బదిలీపై వెళ్లారు.

సంగారెడ్డి తహసీల్దార్‌గా ఫరీన్ షేక్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి తహసీల్దార్‌గా ఫరీన్‌షేక్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం తహసీల్దార్‌గా సంజీవ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. గత నెలలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ శ్రీనివాస్ పదోన్నతిపై వెళ్లారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు. సీనియర్ అసిస్టెంట్ యాసిన్ పాల్గొన్నారు.

ఎరువుల యంత్ర పరికరంపై అవగాహన

వట్‌పల్లి(అందోల్): ఎరువులు వేసే యంత్రపరికరంతో పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత అన్నారు. సోమవారం అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఎరువుల వేసే యంత్ర పరికరంపై రైతులకు అవగాహన కల్పించారు. కంది ఇంజినీరింగ్ కళాశాల ఈ పరికరాన్ని రూపొందించగా దీని ఉపయోగ విధానాన్ని రైతులకు తెలియజేశారు. ఈ యంత్ర పరికరం ద్వారా ఎరువులు వేయుట ద్వారా కావాల్సి మోతాదులో ఎరువులు వేయటంతో పాటు మొక్కకు తొందరగా అందుతుందని తెలిపారు. ఈ యంత్రంతో కూలీల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. సర్పంచ్ యాదాగౌడ్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



1998 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ 1998వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం 25ఏళ్ల సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇదే బ్యాచ్‌లో అకాల మరణంతో మృతి చెందిన తోటి విద్యార్థులైన శ్రీకాంత్, రాజు, నాగరాజు, షకీల్, రాజ్‌మార్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ప్రతి కుటుంబానికి నగదును అందజేశారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు 2 కంప్యూటర్లను అందజేశారు. అదేవిధంగా 220 మంది విద్యార్థులకు ఒకపూట భోజనాన్ని అందజేసినందుకు గాను స్థానిక కరస్పాండెంట్ బాల్‌రెడ్డి పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్‌లో ఈ నెల 9 నుంచి నిర్వహించనున్న అలీఅబ్బాస్ జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఇన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఎడ్యుకేషన్ కిడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, రామేశ్వరంబండ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, ఉపసర్పంచ్ నాగేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్‌లో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, శ్రీను, తుకారాం, రాములు, సాయిలు, మొగులయ్య, పెంటమ్మ, సాయమ్మ, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలని రాస్తారోకో

పటాన్‌చెరు: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని పటాన్‌చెరు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం అమీన్‌పూర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అమీన్‌పూర్ పరిధిలో 393 కుటుంబాలు ఉంటే బీఆర్‌ఎస్ చెందిన 48 మందికి దళితబంధు ఇవ్వడం సరైంది కాదన్నారు.అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో రాణించాలి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని నాగార్జున కాలనీకి చెందిన రాఘవేంద్రకు ఐరన్‌బాక్స్ తదితర సామగ్రిని నీలం మధు ముదిరాజ్ అందజేసి దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేష్, మురళీ, శ్రీనివాస్, అశ్రఫ్, శ్రీను, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జయరాజు

- సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం కొండాపూర్‌లో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలు ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో బాధిత రైతులు మీ–సేవా కేంద్రాల చుట్టూ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోయారు. జీపీ కార్మికులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, రామచందర్, ఆసిఫ్‌అలీ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత వృత్తిదారులను ఆదుకోవాలి



చేనేత కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: చేనేత వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని నారాయణఖేడ్ పద్మశాలీ సంఘం బాధ్యులు కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నారాయణఖేడ్‌లోని పద్మశాలీ భవన్‌లో సీనియర్ చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ చేనేత కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నందునా పద్మశాలీబంధు ప్రకటించి ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. సంఘం బాధ్యులు బషెట్టి, అనంతం, పండరి, నర్సింహులు, జనార్దన్, గుజ్జెటి శ్రీనివాస్, గోస్కె శ్రీనివాస్, శివకుమార్, గణేష్ పాల్గొన్నారు.

తారాలో ప్రపంచ హిరోషిమా దినోత్సవం

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, వృక్షశాస్త్రం, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ హిరోషిమా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా జపాన్‌లోని హిరోషిమా నగరంపై అణుబాంబు వేయడంతో నేటికీ జపాన్‌పై అణు ప్రభావం ఉందని తెలిపారు. భవిష్యత్‌లో మరొక ప్రపంచ యుద్ధం రాకుండా ప్రపంచ దేశాల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పేందుకు భారతదేశం ప్రయత్నించడం సంతోషకరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జగదీశ్వర్, వృక్షశాస్త్ర అధిపతి విజయ్, శివదీప్తి, పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో సంబురాలు

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ విలీన బిల్లును గవర్నర్ ఆమోదించడంతో సోమవారం సంగారెడ్డి డిపో ఆవరణలో ఉద్యోగులు బాణసంచాలు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ విలీనం చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పీరయ్య, నారాయణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్‌కు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): హరివరాసనం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన శివశంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా గురుస్వామి అయ్యప్ప దేవాలయాల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ శతాబ్ది ఉత్సవాల నిర్వాహకులు శంకర్‌ను అభినందించారు. శబరిమల ట్రావెల్కూర్ అధ్యక్షుడు అనంతగోపన్, చంద్రమౌళి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE FAMILY COURT
CUM IV ADDITIONAL DISTRICT COURT.
SANGAREDDY DISTRICT AT SANGAREDDY
E.P. No.166 of 2019

Between:
M/s. Manappuram Finance Ltd.,
Rep. by, G.Krishna,
..Petitioner/Decree-Holder
AND
Nayeem M.D & others
..Respondents/Judgment Debtor No.2
2. R. Srinivas, S/o Thirupathi Rao,
Aged about: Major, Occ: Business/ Pvt. Employee R/o. #H.No.11-203/2, Shanthi Nagar, Patancheru P.O. Medak (Now its Sangareddy) District-502 319.
Please take notice that the Decree Holder filed the above case against Nayeem M.D and Others, You are JDR No.2 vide E.P.No. 166/2019 by M/s. Manapuram Finance Ltd, The above case is posted for your appearance on 10-08-2023 by way of general public against JDR.No.2 at 10:30 in person or through an advocate If you fail to appear before the Hon'ble Court on the above said date and time the matter will be decided according to law.
"BY ORDER OF THE COURT"
GADDAM HANUMAN
Advocate
COUNSEL FOR Decree Holder
H.No.11-2-488/5, Flat No.301, Namalagundu, Seethaphalmandi, Sec'bad-61.
Cell No. 9849030804

నిధులు మంజూరు చేయాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి కార్పొరేటర్ పుష్పనగేష్ వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

పటాన్‌చెరు ఎస్‌ఐగా నాగలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: ఎస్‌ఐగా నాగలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్‌ఐ ప్రసాద్‌రావు బదిలీపై జహీరాబాద్ వెళ్లారు. ఖాళీగా ఉన్న ఆయన స్థానంలో సదాశివపేట్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మి బదిలీపై పటాన్‌చెరుకు వచ్చారు.

ట్రాఫిక్ ఎస్‌ఐగా జీవరత్నం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐగా జీవరత్నం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాములు బదిలీపై సంగారెడ్డి వెళ్లారు. ఆయన స్థానంలో వికారాబాద్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న జీవరత్నం బాధ్యతలు స్వీకరించారు.

శ్మశానవాటికల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్మశానవాటికల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ముస్లిం శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

ఝరాసంగం(జహీరాబాద్): మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని క్రిష్టాపూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ, బ్రీత్ ఎనలైజర్ ద్వారా వాహనదారులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

9న గిరిజన దినోత్సవం

సంగారెడ్డి అర్బన్: ఈ నెల 9వ తేదీ బుధవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నాగల్ గిద్దా జెడ్పీటీసీ రాజు రాథోడ్ తెలిపారు. అనంతరం ప్రపంచ గిరిజన దినోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని సంగారెడ్డి పట్టణంలోని గిరిజన సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. గిరిజన సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, నాయకులు రాజునాయక్, రాథోడ్ పంచాయతీ కార్యదర్శి గోవింద్‌నాయక్, హరిలాల్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కారం



వట్‌పల్లి(అందోల్): పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కారమని జోగిపేట ఐసీడీఎస్ సీడీపీఓ రేణుక అన్నారు. సోమవారం జోగిపేటలోని 9,11,12,14 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు, సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. తల్లిపాలతో పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, శోభారాణి, టీచర్లు పాల్గొన్నారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పకుండా తగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. సోమవారం మండల పరిధిలోని హద్నూర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు.

21మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 21 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 20 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ఆహ్వానం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మంగళవారం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సిబా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం, ఆంగ్లం, తెలుగు, హిందీ బోధకులు అవసరమన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మంగళవారం ఉదయం పాఠశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400